


నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
EVENING EDITION
www.suryaa.com పేజీలు: 02
4PM

## ఐదుగురు మనవరాళ్లతో చిరంజీవి



రిపబ్లిక్ డే సందర్భంగా మెగాస్టార్ చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డు వరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా చిరంజీవి ఐదుగురు మనుమరాళ్లతో దిగిన ఫొటోను ఉపాసన సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'మీరు చూస్తుంది ఒక శక్తివంతమైన పిడికిలిలోని అయిదు వేళ్ళు. సినిమా పరంగానే కాదు ఒక నాన్నగా, ఒక మామగా, ఒక తాతగా మీరు మాకు స్ఫూర్తి. మీకు అభినందనలు' అంటూ పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఈ ఫొటో నెట్టింట వైరల్‌గా మారింది.

బంగారం ధర ₹62,950 10 GRMS 24 CARAT

వెండి ధర 1KG 77,500

సెన్సెక్స్ 70,730 (330)

నిఫ్టి 21,386 (86)

చికెన్ ధర 1KG ₹320

గుడ్ల ధరలు డజన్ ₹68

# ఘోర ప్రమాదం.. ఏడుగురి మృత్యువాత

ఒడిశాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డుపై అతి వేగంతో వెళ్తున్న ఓ కారు ఆటోను, బైక్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. దాదాపు 13 మంది గాయపడ్డారు. మొత్తం రెండు బైక్‌లు, ఒక ట్రాక్టర్, ఎస్‌యూవీకారు, ఆటోరిక్షా ధ్వంసమయ్యాయి. కోరాపుట్ జిల్లాలోని బోరిగుమ్మ ప్రాంతంలో శుక్రవారం జరిగింది. ప్రమాద దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో రికార్డయ్యాయి. బోరిగుమ్మలో సింగిల్ రోడ్డుపై ఒక వైపు నుంచి ఎస్‌యూవీ కారు, ఆటో రిక్షా వస్తున్నాయి. ఎస్‌యూవీ వేగంగా దూసుకొచ్చి ఆటో రిక్షాను ఓవర్‌టెక్ చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ఆటోతోపాటు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఘటన అనంతరం ఎస్‌యూవీ కారు అక్కడి నుంచి పరారయ్యింది. ఆటో బోల్తా పడటంతో అందులోని 15 మంది ప్రయాణికులు రోడ్డుపై డిపోయారు. వీరిలో ఇద్దరు అక్కడికక్కడే మరణించాడు. అప్రమత్తమైన స్థానికులు క్షతగాత్రులను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న 13 మందిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెప్పారు. వారిని కోరాపుట్‌లోని ఓ మెడికల్ కాలేజీకి తరలించినట్లు వివరించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పందించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు మూడు లక్ష చొప్పన నష్టపరిహారం ప్రకటించారు.





## ఒక్కో ఎమ్మెల్యేకి రూ.25 కోట్లు ఆఫర్ చేశారు..
# బీజేపీపై కేజ్రీవాల్ ఆరోపణలు

కేంద్రంలోని అధికార బీజేపీపై ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను కొనేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగానే ఏడుగురు ఎమ్మెల్యేలకు పార్టీ మారితే ఒక్కొక్కరికి రూ.25 కోట్లు ఇస్తామంటూ ఆఫర్ చేసిందని తెలిపారు. ఆప్‌కు చెందిన మొత్తం 21 మంది ఎమ్మెల్యేలతో బీజేపీ పెద్దలు చర్చలు జరిపారని, ఢిల్లీ మద్యం కేసులో కేజ్రీవాల్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామంటూ ఎమ్మెల్యేలను బెదిరించారని అన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలగొట్టే ప్రయత్నంలో భాగంగానే ఇలా చేస్తోందని మండిపడ్డారు. ఈ మేరకు కేజ్రీవాల్ ఓ ట్వీట్ చేశారు. '21 మంది ఎమ్మెల్యేలతో చర్చలు జరిగాయి. ఇతర ఎమ్మెల్యేలతో కూడా సంప్రదింపులు జరుపుతున్నాం. ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వాన్ని కూల్చేస్తాం. మీరు కూడా మాతో రావొచ్చు. రూ.25 కోట్లు ఇస్తాం ఎన్నికల్లో బీజేపీ టికెట్‌పై పోటీ చేయండి' అంటూ తమ పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసే ప్రయత్నం చేసిందని కేజ్రీవాల్ ఆరోపించారు. అయితే ఆప్ ఎమ్మెల్యేలు అందరూ బీజేపీ ఆఫర్‌ను తిరస్కరించినట్లు వెల్లడించారు.

## నం.1 ర్యాంకుకు చేరుకున్న
# రోహిత్ శర్మ



హిట్ మ్యాన్ రోహిత్ శర్మ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అరుదైన ఘనత సాధించారు. ఇప్పటివరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 468 మ్యాచులు ఆడగా, ఏ ఫార్మాట్‌లోను నం.1 ర్యాంకును చేరుకోని ప్లేయర్‌గా రోహిత్ నిలిచారు. కాగా, ఆ తర్వాతి స్థానాల్లో బౌచర్(467), ముష్ఫికర్(458), రాస్ టేలర్(450), షోయాబ్ మాలిక్(446), అజహరుద్దీన్(433) ఉన్నారు.

# పీలేరు రా కదలిరా బహిరంగ సభలో చంద్రబాబు



"రా.. కదలిరా" పేరుతో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు. పలు నియోజకవర్గాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తూ వైసీపీ ప్రభుత్వ తీరుపై, సీఎం జగన్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా చంద్రబాబు నాయుడు నేటి (శనివారం) నుంచి వరుసగా మూడు రోజులు ఆరు నియోజకవర్గాల్లో నిర్వహించనున్న బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. ముందుగా అన్నమయ్య జిల్లా పీలేరు బహిరంగ సభలో చంద్రబాబు పాల్గొని ప్రసంగించనున్నారు. కాసేపటి క్రితమే ప్రత్యేక హెలికాప్టర్‌లో చంద్రబాబు పీలేరు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ చీఫ్‌కు పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం చంద్రబాబు వేదికపైకి చేరుకున్నారు. కాగా.. పీలేరుతో పాటు ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగే బహిరంగ సభల్లో చంద్రబాబు పాల్గొంటారు. ఈరోజు ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి తిరుపతి చేరుకున్న చంద్రబాబు.. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో పీలేరు మండలంలోని వేపులబయలకు చేరుకున్నారు. అక్కడి బహిరంగ సభలో టీడీపీ చీఫ్ ప్రసంగించనున్నారు. అనంతరం సాయంత్రం ఉరవకొండ బహిరంగ సభలో పాల్గొననున్నారు. రేపు (28న) నెల్లూరు రూరల్, పత్తికొండల్లో చంద్రబాబు బహిరంగ సభలు నిర్వహించనున్నారు. 29న రాజమండ్రి రూరల్, పొన్నూరులో జరగనున్న సభల్లో చంద్రబాబు పాల్గొననున్నారు.

**అన్నగారి స్ఫూర్తితో ముందుకు...**

'రా.. కదలిరా!' అన్న పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన ప్రతిపక్షం టీడీపీ బహిరంగ సభలు నిర్వహిస్తోంది. పార్టీని స్థాపించిన సమయంలో దివంగత ఎన్టీ రామారావు 'తెలుగుదేశం పిలుస్తోంది.. రా కదలిరా' అని ఇచ్చిన నినాదానికి అశేష తెలుగు ప్రజానీకం మంత్రముగ్ధులయ్యారు. టీడీపీని అక్కున చేర్చుకున్నారు. ఇప్పుడు అదే స్ఫూర్తితో ఆ నినాదాన్ని పేరుగా మార్చుకుని ఎన్నికల రణరంగంలోకి దిగాలని టీడీపీ నిర్ణయించింది. 'రా.. కదలిరా' పేరుతో ఈ నెలలో 12 రోజుల్లో మొత్తం 22 సభలు నిర్వహించాలని చంద్రబాబు తలపెట్టారు.



# విచారణకు వెళ్లిబాలికతో అసభ్య ప్రవర్తన

నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న కానిస్టేబుల్ మహేశ్‌పై పోక్సో కేసు నమోదైంది. కానిస్టేబుల్ మహేశ్ ఓ కేసు విషయమై నిందితుడికి సమన్లు అందించడానికి ఆదివారం నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండారం గ్రామానికి వెళ్లాడు. ఇంట్లో నిందితుడు లేకపోవడంతో పక్కింట్లో ఉన్న బాలికతో మాట్లాడి నిందితుడి వివరాలను తెలుసుకున్నాడు. ఈ క్రమంలో బాలికతో మహేశ్ అసభ్యంగా ప్రవర్తించాడు. తల్లిదండ్రులు రాత్రి ఇంటికి వచ్చాక బాలిక వారికి విషయం చెప్పింది. దీంతో వారు సోమవారం ఉదయం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కానిస్టేబుల్ వ్యవహారాన్ని ఎస్సై మహేశ్ నిజామాబాద్ సౌత్ సీఐ వెంకటనారాయణకు వివరించారు. ఆయన సీపీ కల్మేశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. సీపీ ఆదేశాల మేరకు పోలీసులు శుక్రవారం మహేశ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. మహేశ్ గతంలో ఓ కేసు విషయంలో సస్పెండ్ అయ్యారు. సస్పెన్షన్ ఎత్తేశాక మళ్లీ అదే స్టేషన్‌లో విధుల్లో కొనసాగుతున్నారు. పోక్సో కింద కేసు నమోదు కావడంతో సదరు కానిస్టేబుల్ పరారీలో ఉన్నాడు.



# పవన్ వ్యాఖ్యలతో టీడీపీ అలర్ట్

పవన్ వ్యాఖ్యలతో టీడీపీ అలర్ట్ అయినట్లు తెలుస్తోంది. పవన్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని పార్టీ నేతలు చెబుతున్నారు. పవన్ రెండు సీట్లు ప్రకటించడం వల్ల తమకు ఇబ్బంది లేదని అన్నారు. ఏ రకంగా పవన్ వ్యాఖ్యల పైన స్పందించవద్దని పార్టీ నాయకత్వం ఇప్పటికే ఆదేశించినట్లు సమాచారం. ఇదే సమయంలో రాజానగరం, రాజోలు నుంచి టీడీపీ సీనియర్లు సీట్లు ఆశిస్తున్నారు. దీంతో ఈ రోజు రాజోలు నేతలు అచ్చెన్నాయుడుతో సమావేశం కానున్నారు.



# కేంద్ర ప్రభుత్వానికి బెంగాల్ సీఎం హెచ్చరిక

ఏడు రోజుల్లోగా పశ్చిమ బెంగాల్‌కు బకాయి ఉన్న నిధులను విడుదల చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేంద్ర ప్రభుత్వానికి ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ హెచ్చరించారు. డిసెంబర్ 20న ప్రధాని మోడీని కలిసి పెండింగ్ నిధులపై చర్చించారు. బెంగాల్‌కు రూ.1 లక్షా 16 వేల కోట్లు ఇవ్వాల్సి ఉందని ఆమె తెలిపారు. త్వరగా బకాయిలు చెల్లించాలని మమతా బెనర్జీ డిమాండ్ చేశారు.



# దక్షిణాఫ్రికా గడ్డపై భారత్ హవా..
## మూడు గోల్స్‌తో అద్భుత విజయం

దక్షిణాఫ్రికా పర్యటనలో భారత పురుషుల హాకీ జట్టు జోరు కొనసాగిస్తోంది. కేప్ టౌన్‌లో శుక్రవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టుపై 3-0తో టీమిండియా ఘన విజయం సాధించింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, అభిషేక్, సుమిత్‌లు తలొక గోల్ కొట్టారు. సఫారీ ఆటగాళ్లు ఎంత ప్రయత్నించినా ఒక్క గోల్ కూడా చేయలేకపోయారు.ఆట మొదలైన రెండో నిమిషంలోనే భారత్ తొలి గోల్ కొట్టింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ డ్రాగ్‌ఫ్లిక్‌తో సూపర్ గోల్ అందించాడు. అనంతరం 13 వ నిమిషంలో అభిషేక్ భారత ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. ఆ తర్వాత 30వ నిమిషంలో సమిత్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. రెండో అర్థభాగంలో దక్షిణాఫ్రికా అటాకింగ్ గేమ్ ఆడినప్పటికీ.. భారత డిఫెండలర్లు సమర్థంగా అడ్డుకున్నారు. దాంతో టీమిండియా బంపర్ విక్టరీ కొట్టింది. ఆదివారం జరిగే మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన నెదర్లాండ్స్ జట్టును ఢీకొట్టనుంది.

# దేశంలో ఓటర్ల సంఖ్య @96 కోట్లు



లోక్‌సభ ఎన్నికల వేళ దేశంలో ఓటర్లకు సంబంధించిన వివరాలను కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. దేశంలో రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 96 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులని పేర్కొంది. 2019 నాటికి ఈ సంఖ్య 91.20 కోట్లుగా ఉన్నట్టు ఈసీ వివరాల్లో తెలిపింది. కాగా, దేశంలో ఓటర్లకు సంబంధించి ఈసీ వివరాలను వెల్లడించింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 96 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులని తెలిపింది. వీరిలో మహిళలు 47 కోట్ల మంది ఉన్నారని ఈసీ స్పష్టంచేసింది. అదేవిధంగా మొత్తం ఓటర్లలో 1.73 కోట్ల మందికి పైగా 18-19 ఏండ్ల వయసు ఉన్నవారేనని తెలిపింది. ఇక, ఎన్నికల నిర్వహణ కోసం దేశవ్యాప్తంగా 12 లక్షల పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని, దాదాపు 1.5 కోట్ల మంది పోలింగ్ సిబ్బందిని నియమించనున్నట్లు ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. గతేడాది రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం పంపిన ఓ లేఖ ప్రకారం.. దేశంలో 1951లో 17.32 కోట్ల మంది నమోదిత ఓటర్లు ఉండగా.. 2019 నాటికి ఈ సంఖ్య 91.20 కోట్లకు చేరింది. తొలి లోక్‌సభ ఎన్నికల్లో 45 శాతం పోలింగ్ నమోదు కాగా.. గత పార్లమెంటు ఎన్నికల్లో 67 శాతంగా ఉంది.



# కామారెడ్డి ఎమ్మెల్యే మరో సంచలన నిర్ణయం

అసెంబ్లీ ఎన్నికల సమయంలో సొంత మేనిఫెస్టో ప్రకటించడంతోపాటు, ఇద్దరు ఉద్ధండులను ఓడించి చరిత్ర సృష్టించిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి(కేవీఆర్) మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. రోడ్డు విస్తరణ కోసం ముందుగా తన ఇంటిని కూల్చేందుకు ముందుకొచ్చారు. కామారెడ్డి పట్టణంలోని పాత బస్టాండ్ నుంచి అడ్లూర్ రోడ్డు వరకు విస్తరణకు ఎన్నో ఆటంకాలు ఎదురయ్యాయి. ఇదే రోడ్డులో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఇల్లుతోపాటు మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ ఇల్లు కూడా ఉంది. ట్రాఫిక్ పెరగడంతోపాటు, పలుచోట్ల ఆక్రమణలతో ఈ రోడ్డు ఇరుకుగా మారింది. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణ కోసం స్వచ్ఛందంగా తన ఇంటిని కూల్చేందుకు ఎమ్మెల్యే కేవీఆర్ సిద్ధమయ్యారు. శనివారం ఇంటి కూల్చివేత పనులు ప్రారంభించాలని నిర్ణయించారు. తన ఇంటితోనే రోడ్డు వెడల్పు పనులు జరిగేలా ప్రణాళిక రూపొందించిన ఆయన.. పదిరోజుల క్రితమే ఇంటిని ఖాళీ చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి మారారు.

# లోక్‌సభ ఎన్నికల బరిలోకి కుమారస్వామి?



రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కుమారస్వామి పోటీ చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్‌షా కోరుకుంటున్నారని మాజీ ప్రధానమంత్రి హెచ్.డి.దేవేగౌడ పేర్కొన్నారు. దీనిపై వారు ఒత్తిడి చేస్తే కుమారస్వామి లోక్‌సభకు పోటీ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కుమార పోటీ చేస్తే ఎక్కడి నుంచి అనే విషయం త్వరలో ఖరారు అవుతుందని హాసనలో తనను కలుసుకున్న విలేకరులకు తెలిపారు. దళ్ కోరుకుంటున్న నాలుగు నియోజకవర్గాల వివరాలను భాజపా ముందు ఉంచామని, త్వరలోనే దానిపై ఒక స్పష్టత వస్తుందని పేర్కొన్నారు.

## సీఎం పదవికి నేడు రాజీనామా
# చేయనున్న నితీష్ కుమార్?



లోక్‌సభ ఎన్నికలకు ముందు బిహార్‌లో రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. సీఎం నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూ, ఆర్జేడీ పార్టీల మధ్య విభేదాలు తలెత్తాయి. దాంతో కూటమితో తెగతెంపులకు సీఎం నితీష్ కుమార్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. బీజేపీ కూటమితో చేతులు కలిపేందుకు నితీష్ కుమార్ మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా సీఎం పదవికి నితీష్ కుమార్ శనివారం రాజీనామా చేయబోతున్నారని ప్రచారం జరుగుతోంది.



## హాలీవుడ్‌లో దుమ్మురేపుతున్న సలార్

ఖాన్సార్ సామ్రాజ్యం నేపథ్యంలో ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ తెరకెక్కించిన చిత్రం 'సలార్'. శ్రుతిహాసన్ కథానాయిక. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా రూ. 700 కోట్లకు పైగా కలెక్షన్స్ రాబట్టింది. వెయ్యి కోట్లు రాబట్టే సత్తా ఉన్నా బాలీవుడ్‌లో ఎలాంటి ప్రమోషన్స్ చేయకపోవడంతో ఆ మార్క్‌ను రీచ్ కాలేకపోయింది. అంతే కాకుండా డంకీ సినిమాకు కార్పొరేట్ బుకింగ్స్ జరగడం. సలార్‌కు బాలీవుడ్‌లో పెద్దగా స్క్రీన్స్ ఇవ్వకపోవడం వంటివి జరగడంతో కలెక్షన్స్‌పై కొంత ప్రభావం పడింది. తాజాగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతున్న సలార్‌కు ఓటీటీ ప్రేక్షకులు ఫిదా అవుతున్నారు. ఇప్పుడు నార్త్‌లో టాప్-1లో దూసుకుపోతుంది. టాలీవుడ్ నుంచి మొదలైన ప్రభాస్ దండయాత్ర పాన్ ఇండియా దాటి హాలీవుడ్‌లో అడుగుపడింది. జనవరి 20 నుంచి ఓటీటీలో రన్ అవుతున్న సలార్ గ్లోబల్ ఆడియన్స్‌కు దగ్గరైంది. హాలీవుడ్ ప్రేక్షకులు ప్రభాస్ కటౌట్ చూసి ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం #Salaar-GoesGlobal హ్యాష్ ట్యాగ్ ఇంటర్నెట్‌లో వైరల్ అవుతుంది.నెట్‌ఫ్లిక్స్‌కు భారత్‌లో కంటే ఫారిన్ దేశాల్లోనే సబ్‌స్కైబర్స్ ఎక్కువ దీంతో వారిలో సలార్‌ను చూసి బాగుందంటూ కామెంట్లు చేయడం విశేషం.



# బాలకృష్ణ రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు


హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణను ఏసీబీ మరో వారం రోజుల కస్టడీ కోరనున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో బాలకృష్ణ ఆమోదించిన ఫైల్స్, బినామీ ఆస్థులపై ఏసీబీ ఫోకస్ పెట్టింది. మరోవైపు.. బాలకృష్ణ రిమాండ్ రిపోర్ట్‌లో కీలక అంశాలను అధికారులు వెల్లడించారు. కాగా, లేఅవుట్ అనుమతుల కోసం బాలకృష్ణ భారీగా లంచాలు డిమాండ్ చేసినట్లు రిమాండ్ రిపోర్ట్ పేర్కొన్నారు. అప్లికేషన్లలో తప్పులు ఉన్నాయని లాభాలు పొందినట్టు తెలిపారు. ఫ్లాట్స్ నిర్మాణాల్లో విల్లాలను సైతం లంచంగా బాలకృష్ణ తీసుకున్నాడు. బాలకృష్ణ ఆధ్వర్యంలో హెచ్ఎండీఏ, రెరాలో భారీగా అక్రమాలు జరిగినట్టు స్పష్టం చేశారు. హెచ్ఎండీఏలోని మూడు జోన్లపై బాలకృష్ణకు మంచిపట్టు ఉందని గుర్తించారు. ఇక, హెచ్ఎండీఏలోని కీలక పోస్టులో బాలకృష్ణ సుదీర్ఘంగా పని చేశారు. మరోవైపు.. బాలకృష్ణను కస్టడీలోకి తీసుకున్నాక ఏసీబీ బ్యాంక్ లాకర్లను ఓపెన్ చేయనుంది. ఇదే సమయంలో బాలకృష్ణకు సహాయం చేసిన అధికారులపై కూడా విచారించనున్నారు. ఇదిలా ఉండగా.. వట్టి నాగులపల్లిలో ప్రభుత్వ భూముల యాజమాన్యం, వినియోగ హక్కుల మార్పిడిపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. అక్రమాలు జరిగిన భూముల ఫైల్స్‌పై సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరిపే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. వట్టి నాగులపల్లిలో ఎలక్షన్ కోడ్‌కు కొద్ది రోజుల ముందే పెద్ద ఎత్తున భూ వినియోగ మార్పిడి జరిగినట్టు అధికారులు గుర్తించారు. ఆ సమయంలో హెచ్ఎండీఏ డైరెక్టర్‌గా లేకపోయినా ఫైల్స్ ఆమోదంలో బాలకృష్ణ పాత్రపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఇక, హెచ్ఎండీఏ నుండి ఆరు నెలల క్రితమే బదిలీ అయి తెలంగాణ రేరా సెక్రటరీగా బాలకృష్ణ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో, బాలకృష్ణ హయాంలో ఇచ్చిన అక్రమ అనుమతులపై ఏసీబీ దర్యాప్తు చేపట్టింది. అయితే, బాలకృష్ణ తన దగ్గరి బంధువులను ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా నియమించుకుని అక్రమాలకు పాల్పడినట్టు అధికారులు గుర్తించారు. కొందరు పొలిటికల్ లీడర్లు కూడా అక్రమాలకు మధ్యవర్తులుగా వ్యవహరించినట్టు సమాచారం.



## రామ్‌లల్లా దర్శన సమయాల్లో మార్పులు

అయోధ్యలోని నూతన రామాలయంలో బాలరాముడు కొలువైన అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. లక్షలాది మంది భక్తులు బాలరాముని దర్శనం చేసుకునేందుకు అర్ధరాత్రి నుండే గజగజ వణికిస్తున్న చలిలో సైతం క్యూలలలో వేచివుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు కీలక నిర్ణయం తీసుకుంది. అధిక సంఖ్యలో భక్తులు రామ్‌లల్లాను చూసేందుకు, పూజలు చేసేందుకు అవకాశాన్ని కల్పించాలని ట్రస్ట్ దర్శన సమయాల్లో మార్పులు చేసింది. ఈ సమాచారాన్ని విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మీడియాకు అందించింది. విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి మాట్లాడుతూ రామ భక్తులకు ఇకపై దర్శనానికి మరో గంట సమయం అదనంగా లభిస్తుందన్నారు. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు రామ్‌లల్లా హారతి, దర్శనం కోసం విడుదల చేసిన షెడ్యూల్ వివరాలు..

మంగళ హారతి: ఉదయం 4.30 గంటలకు
ఉత్థాన్ హారతి : ఉదయం 6.30 గంటలకు
దర్శనం: ఉదయం 7 గంటల నుంచి
భోగ్ హారతి: మధ్యాహ్నం 12 గంటలకు
సాయంత్రం హారతి: 7.30 గంటలకు
రాత్రి భోగ్ హారతి: 9 గంటలకు
శయన హారతి: రాత్రి 10 గంటలకు



## అనుకున్న తేదీకే 'పుష్ప ది రూల్'

021 చివర్లో విడుదలై దేశవ్యాప్తంగా అపూర్వ విజయాన్ని సొంతం చేసుకున్న చిత్రం 'పుష్ప ది రైజ్'. టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఇక ఈ సినిమాకు సీక్వెల్‌గా 'పుష్ప ది రూల్ చిత్రం రానుంది. మాస్ యాక్షన్ థ్రిల్లర్‌గా రానున్న ఈ సినిమా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటుంది. అయితే ఈ సెకండ్ పార్ట్‌ను 2024 ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు గతంలోనే మేకర్స్ అనౌన్స్ చేసిన సంగతి తెలిసిందే. రీసెంట్‌గా 'పుష్ప' సినిమా వాయిదా పడనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. తాజాగా ఈ వార్తలకు చెక్ పెడుతూ.. 'పుష్ప యూనిట్ మరోసారి క్లారిటీ ఇచ్చింది. ఈ సినిమాను ముందు చెప్పినట్లుగానే ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం ఈ రిలీజ్ డేట్ క్లారిటీ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మరోవైపు పుష్ప 2 రిలీజ్ రోజే బాలీవుడ్‌లో అజయ్ దేవ్‌గన్ నటిస్తున్న సింగం అగైన్ సినిమా కూడా రిలీజ్ కానుంది. ఇక పుష్ప ది రూల్ ఓటీటీ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా వెల్లడించింది.

# మరాఠా రిజర్వేషన్లకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్..

### దీక్ష విరమించిన ఉద్యమకారుడు మనోజ్ జరాంగే



మహారాష్ట్రలో కొనసాగుతున్న మరాఠా రిజర్వేషన్ల ఉద్యమం ముగిసింది. వారి డిమాండ్లకు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. దీంతో ఉద్యమకారుడు మనోజ్ జరాంగే శనివారం ఉదయం 8 గంటలకు తన నిరసన దీక్షను విరమించారు. ప్రభుత్వ నిర్ణయంతో కార్మికులు సంబరాలు చేసుకుంటున్నారు. మరాఠాలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ మనోజ్ జరాంగే నేతృత్వంలో కొంతకాలంగా ఉద్యమం కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే, వీరి డిమాండ్లను మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో ఆగ్రహించి తాడోపేడో తేల్చుకోవడానికి జరాంగే నేతృత్వంలో వేలమంది ముంబై దిశగా ర్యాలీ చేపట్టారు. అయినా ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబిస్తుండటంతో తాజాగా జరాంగే డెడ్‌లైన్ విధించారు. 'రిజర్వేషన్ల కోసం ఉద్యమం ఉధృతంగా సాగుతున్నది. ర్యాలీ దాదాపు ముంబై దగ్గరికి వచ్చింది. ఇప్పుడు ప్రభుత్వం చెప్పే మాటలు వినే పరిస్థితి లేదు. కాబట్టి ప్రభుత్వం శనివారం ఉదయం 11 గంటలలోపు అధికార ప్రకటన చేయాలి. లేకుంటే 12 గంటలకు కార్యాచరణ ప్రకటిస్తా. మా అడుగులు ముంబైలోని ఆజాద్ మైదాన్ దిశగానే పడుతాయి. ఒక్కసారి అడుగు పడిందంటే వెనక్కి తిరిగి చూసేది లేదు. మా డిమాండ్‌ను సాధించుకున్నాకే తిరిగి ఇంటికి వెళ్తాం' అని జరాంగే ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం నుంచే తిండి తినడం మానేశానని, కేవలం నీళ్లు తాగుతున్నానని తెలిపారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్‌ను ప్రభుత్వం అర్థం చేసుకోవాలని సూచించారు. వీరి డెడ్‌లైన్‌కు దిగివచ్చిన మహా సర్కార్.. డిమాండ్లను నెరవేర్చేందుకు అంగీకరించింది. దీంతో వారు దీక్షను విరమించారు.



## ఉస్మానియా పీజీ హాస్టల్ విద్యార్థుల ధర్నా


ఉస్మానియా యూనివర్సిటీ వద్ద ఉద్రిక్తత నెలకొంది. పీజీ కాలేజ్ విద్యార్థులు ధర్నా చేశారు. రాత్రి 2 గంటలకు ముగ్గురు ఆగంతకులు తాగి లేడీస్ హాస్టల్లోకి వచ్చారని హాస్టల్ వాష్‌రూమ్ వెంటిలేటర్స్ నుంచి చేతులు పెట్టి రమ్మని పిలుస్తున్నారని విద్యార్థులు తెలిపారు. స్టూడెంట్స్ అందరం కలిసి ఒక వ్యక్తిని పట్టుకున్నామని అన్నారు. ఇద్దరు పారిపోయారని చెప్పారు. గత వారం రోజులుగా ఇలాగే జరుగుతుందని కాలేజ్ చుట్టూ గంజాయి బ్యాచ్ పెరిగిపోయిందని తెలిపారు. 250 మంది విద్యార్థినులు ఉండే హాస్టల్ కి కేవలం ఒకరే సెక్యూరిటీ గార్డ్ ఉన్నారని విద్యార్థులు తెలిపారు. వీసీ వచ్చి మాకు పూర్తి భద్రత కల్పించాలని హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా దగ్గరికి పోలీసులు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ధర్నా వద్దకు వచ్చిన ఓయూ రిజిస్ట్రార్ విద్యార్థులను ధర్నా విరమించమని కోరారు. వీసీ వచ్చే వరకు ధర్నా విరమించబోమంతున్న స్టూడెంట్స్ తెలిపారు.



## 'కంగువా' నుంచి క్రేజీ అప్‌డేట్.. ఉధిరన్ గా బాబీ డియోల్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా కంగువ. శివ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ సూర్య 42 ప్రాజెక్ట్‌గా వస్తోంది. స్టూడియో గ్రీన్-యూవీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ 3డీ ఫార్మాట్‌లో సందడి చేయనుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి కంగువ గ్లింప్స్ తో పాటు పోస్టర్‌లు విడుదల చేయగా ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ దక్కించుకుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా నుంచి మరో అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. నేడు బాబీ డియోల్ పుట్టినరోజు. ఈ సందర్భంగా మూవీ నుంచి బాబీ ఫస్ట్ లుక్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో బాబీ ఒక తెగకు సంబంధించిన నాయకుడిగా కనిపిస్తుండగా.. తెగకు సంబంధించిన ప్రజలు తనను మొక్కుతున్నట్లు ఈ పోస్టర్ ఉంది. ఇక ఈ సినిమాలో బాబీ ఉధిరన్ గా కనిపించబోతున్నట్లు మేకర్స్ తెలిపారు.

## రామ్ చరణ్ జోడీగా ఆలియా భట్



[redacted]

మరి.. రామ్‌చరణ్, ఆలియా భట్ జోడీ రిపీట్ అవుతుందా? అనేది తెలియాలంటే కొన్ని రోజులు ఆగాల్సిందే. ఇక ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మార్చిలో ప్రారంభం కానుందని తెలిసింది. రామ్‌చరణ్ బర్త్ డే (మార్చి 27) సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ విడుదలయ్యే అవకాశం ఉందని టాక్. కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ ఓ కీలక పాత్రలో నటించనున్న ఈ సినిమాకు ఏఆర్ రెహమన్ స్వరకర్త. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌లతో కలిసి వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మించనున్నారు.



## టీమ్ఇండియా 436 పరుగులకు ఆలౌట్

### ఆధిక్యం 190

ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో టీమ్ఇండియా 436 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 421/7తో మూడో రోజు ఆట ప్రారంభించిన భారత్.. కాసేపటికే మరో 15 పరుగులు జోడించి మిగిలిన మూడు వికెట్లు కోల్పోయింది. బ్యాటింగ్‌లో అదరగొట్టిన జడేజా (87), కేఎల్ (86) జైస్వాల్ (80) కొద్దిలో సెంచరీలు మిస్సయ్యారు. అంతకుముందు అక్షర్ (44), భరత్ (41) అర్ధశతకాలు చేజార్చుకున్నారు. కెప్టెన్ రోహిత్ (24), గిల్ (23), అయ్యర్ (35) ఫర్వాలేదనిపించగా.. అశ్విన్ (1), బుమ్రా (0) నిరాశపరిచారు. సిరాజ్ నాటౌట్‌గా నిలిచాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో రూట్ 4, హార్ట్‌లీ, రెహాన్ చెరో రెండు, లీచ్ ఒక వికెట్ తీశాడు. అంతకుముందు ఇంగ్లాండ్ జట్టుకు భారత్ బంతితో గట్టి షాకిచ్చింది. పర్యాటక జట్టును 246 పరుగులకు కట్టడి చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్ ముగిసే సరికి టీమ్ఇండియా ఆధిక్యం 190 పరుగులుగా ఉంది.